

పేదలకు దుస్తుల పంపిణీ

చీమకుర్తి: అరుణోదయ ఆదరణ వృద్ధాశ్రమంలో ఆదివారం చీమకుర్తిలో పేదలైన వృద్ధులు, చిన్నారులకు నిర్వాహకులు అరుణ చేతుల మీదుగా నూతన దుస్తులను పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా పేదలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌ఐ శ్రీకాంత్ ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో మాటు వేసి పట్టుకున్నారు. మల్లవరం గ్రామానికి చెందిన కొసనం మహేశ్వరరావు అనే వ్యక్తి అక్రమంగా వెల్లంపల్లి గ్రామంలో మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో ఆదివారం వెల్లంపల్లి సెంటర్‌లో మాటు వేసి దాడి చేశారు. 25 క్వార్టర్ బాటిళ్లు లభించాయి. ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు


ఒంగోలులో రంగవల్లులు వేస్తున్న యువతులు


విజేతలకు బహుమతులిస్తున్న మారం వెంకారెడ్డి


లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో భోగి మంట వెలిగిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి


సంక్రాంతి కొత్త బియ్యంతో పొంగలి పెడుతున్న మహిళలు

చీమకుర్తి: సంక్రాంతి పండగ సందర్భంగా చీమకుర్తి గాంధీనగర్‌లో మారం వెంకారెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన వారికి అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకులు మారం వెంకారెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందించారు. కోటా రాములు, పోకూరి రామకృష్ణారెడ్డి, చింతకింది అశోక్, మర్రిపూడి రమణయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ఒంగోలు: స్థానిక ఒంగోలు జూనియర్ చాంబర్, లయన్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లాయరుపేట సాయిబాబా మందిరం వద్ద భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్ ధాకా సుజాత హనుమారెడ్డి, శిద్దా సూర్యప్రకాశరావు, రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబుతో కలిసి నిర్వాహకులు భోగిమంటలు వెలిగించారు. నేటితరానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చిన వారం అవుతామన్నారు. జేసీస్ అధ్యక్షుడు వరుణ్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ శ్రీరాములు రెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ లెజెండరీ అధ్యక్షుడు వెంకట్రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ విజన్ కార్యదర్శి బదరీతోపాటు మంగళగిరి నరసింహారావు, సోమినేని సురేష్‌బాబు, వీవీ రమణ, కూరపాటి రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

కొత్తపట్నం: ఎన్నో ప్రకృతి దృశ్యాలకు నిలయమైన సాగర తీరం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. సంక్రాంతి సెలవులతో పాటు ఆదివారం సెలవు రావడంతో జిల్లా నుంచి యాత్రికులు బీచ్‌ను సందర్శించారు. నగరానికి మెరైన్ సిబ్బందితో సముద్రంలోనికి వెళ్ల నియకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కుర్రకారును అదుపు చేశారు. మండల ప్రజలు ఆదివారం భోగి సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే పల్లెల్లో, తీర ప్రాంత గ్రామాల్లో తేడా లేకుండా ఇళ్ల ముందు భోగి మంటలు వేసి, చిన్నా, పెద్ద తేడా లేకుండా చలి కాచుకున్నారు.

ఘనంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు


తలపడుతున్న క్రీడాకారులు

ఒంగోలు రూరల్: రూరల్‌లోని కరవది రైలుపేటలోని కమ్యూనిటీ హాల్ సెంటర్‌లో గణపతి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. మొదటి బహుమతి డీఎఫ్ఎస్ కరవది, రెండో బహుమతి బసవన్నపాలెం, మూడో బహుమతి వజ్జిరెడ్డిపాలెం, నాలుగో బహుమతి ఎస్ఏవీ కరవది గెలుచుకున్నాయి. బహుమతి ప్రధాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మిడసల వెంకటేశ్వర్లు (ప్రొఫెసర్) హెచ్ఎం అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరరావు, సాతులూరి అంకరావు (వైఎస్సార్ సీపీ లీడర్), అంజయ్‌బాబు, వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలకు నేషనల్ లెవల్ సీనియర్స్, నేషనల్ లెవల్ జూనియర్స్ వారి క్రీడా కౌసల్యాన్ని ప్రదర్శించారు. బూస్టింగ్‌లో, షార్ట్ డ్రాపింగ్‌లో, బ్లాకింగ్ లో, సర్వీసులో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు.

తెప్పోత్సవ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

ఒంగోలు మెట్రో: కనుమ పురస్కరించుకుని మంగళవారం రంగారాయుడు చెరువులో జరుగనున్న శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి తెప్పోత్సవ కార్యక్రమానికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఒంగోలు నగర డీఎస్పీ వి. నారాయణ స్వామి రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేశారు. బారికేడ్లు నిర్మించి ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. ఒంగోలు తాలూకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భక్తవత్సల రెడ్డి , సబ్ ఇన్‌స్పెక్టర్ సుమన్, శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్య నారాయణ, కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, ఈమని మదన్మోహన్, ధాకా హనుమారెడ్డి, సూపర్ బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి ఉన్నారు.

వైభవంగా తెప్పోత్సవం


చీమకుర్తి చెరువులో వైభవంగా నిర్వహించిన తెప్పోత్సవం


కల్యాణోత్సవంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కుటుంబ సభ్యులు

చీమకుర్తి: ధనుర్మాస తిరుప్పావై వ్రత మహోత్సవాన్ని పురస్కరించుకొని అగ్రహారంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పరిధిలోని చెరువులో తెప్పోత్సవం కార్యక్రమం ఆదివారం రాత్రి ఆలయ కైంకర్య పోషకులు శిద్దా వెంకటేశ్వరరావు, సూర్యప్రకాష్, హనుమంతురావు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి, గోదాదేవి కల్యాణం సందర్భంగా భక్తులతో కలిసి ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన తెప్పోత్సవాన్ని భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. తెప్పోత్సవం, గోదాదేవి కల్యాణోత్సవం సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గోదాదేవి కల్యాణం

చీమకుర్తి హరిహరక్షేత్రంలో గోదాదేవి కల్యాణోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి, శిద్దా పాండురంగారావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చీమకుర్తి బస్టాండ్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన గోదాదేవి కల్యాణాన్ని టీటీడీ అర్చకులు పరాంకుశం సాయికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పీడీసీసీబీ చైర్మన్ వై.ఎం. ప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సంవత్సరంలో కొత్త వెలుగులను నింపాలని కోరుకున్నారు.

సుబ్బారావుకు సత్కారం


కదవా సుబ్బారావును సత్కరిస్తున్న దృశ్యం

అల్లూరు (కొత్తపట్నం): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం బండారు రామ నాట్య మండలి ఆధ్వర్యంలో అల్లూరులో సత్యహరిశ్చంద్ర నాటకం నిర్వహించారు. అల్లూరు గ్రామస్తులు ఎంపీటీసీ సభ్యుడు, కళాకారుడు మిట్నసల శాంతారావు, ప్రభుదాసు, బుర్ర శ్రీనివాసరావు, ముసలయ్య, రత్తయ్య నాటకాన్ని నిర్వహించారు. సత్యహరిశ్చంద్ర నాటకాన్ని నేర్పించిన గురువు కదవా సుబ్బారావును శాలువాతో సత్కరించారు. అంతరించుపోతున్న పౌరాణికాన్ని బతికించేందుకు సత్యహరిశ్చంద్ర, చింతామణి వంటి నాటకాలు వేయడం అభినందనీయమన్నారు.